క్లుప్తంగా

పేదలకు 'చారిటీ బాక్స్' సాయం



పేదలకు నిత్యావసర సరకులను అందిస్తున్న చారిటీ బాక్స్ సభ్యులు

బీచ్‌రోడ్డు: సంక్రాంతిని పురస్కరించుకొని చారిటీ బాక్స్ సంస్థ ఆధ్వర్యంలో శనివారం నగరంలోని శివాజీపాలెం, ఎంవీపీ కాలనీ, పెదవాల్తేరు, తాటిచెట్లపాలెం, బీచ్ రోడ్డు ప్రాంతాల్లో నివసిస్తున్న పేదలకు నిత్యావసర సరకులను అందజేశారు. ఒక్కో కిట్‌లో 15 రకాల సరకులు ఉన్నాయిని సభ్యులు చెక్కా రమాదేవి, శంకరరావు తెలిపారు. సంక్రాంతి పండగను ప్రతి ఒక్కరూ సంతోషంగా జరుపుకోవాలని ఉద్దేశంతో రాష్ట్ర వ్యాప్తంగా పలు నగరాల్లోని పేదలకు తమ చారిటీ బాక్సు తరపున సాయం చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో లక్కోజు నూకరాజు, కె.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

బాలికకు అరుదైన ఎండోస్కోపిక్ చికిత్స



చికిత్స ద్వారా కోలుకున్న బాలికతో డాక్టర్ శ్రీనివాస్ తదితరులు

ఎంవీపీకాలనీ: ఒడిశాకు చెందిన 15 ఏళ్ల ఓ బాలిక మూడు నెలలుగా కడుపు నొప్పితో బాధపడుతోంది. స్థానిక ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నప్పటికీ ఉపశమనం లభించకపోగా కడుపు వాపు వచ్చింది. దీంతో యాంటీ ట్యూబర్‌క్యులర్ చికిత్స అందించారు. అయినప్పటికీ బాలికకు ఉపశమనం లభించకపోగా ఆకలి తగ్గి బరువు 15 కేజీలకు పడిపోయింది. స్థానిక వైద్యుల సూచన మేరకు విశాఖలోని మెడికవర్ ఆస్పత్రికి బాలిక వచ్చింది. పరీక్షలు నిర్వహించిన గాస్ట్రో ఎంటరాలజీ డాక్టర్ నిష్టల శ్రీనివాస్ బృందం చికిత్స ప్రారంభించింది. రెండు చెంచాల ఆహారం కూడా తీసుకోలేని పరిస్థితిలో ఉన్న ఆ బాలికకు సీటీ స్కాన్, అడ్వాన్స్‌డ్ మాగ్నెటిక్ రెసోనెన్స్ కోలాంగియో పాంక్రియాటోగ్రఫీతోపాటు ఇతర వైద్య పరీక్షలు చేశారు. వాటి ద్వారా రోగికి పాంక్రియాటిక్ సూడోసిస్ట్, పాంక్రియాటిక్ ఫిస్టులా వ్యాధితో బాలిక బాధపడుతోందని గుర్తించారు. దీంతో రోగికి ఆధునిక ఎండోస్కోపిక్ అల్ట్రాసౌండ్ (ఈయూఎస్) ఉపయోగించి సిస్టో గ్యాస్ట్రోనమీ, పాంక్రియాటిక్ డక్ట్ స్టింటింగ్‌తో కూడిన వైద్యం అందించారు. దీంతో 24 గంటల్లో సదరు బాలికకు ఉపశమనం లభించడంతోపాటు చురుగ్గా కోలుకుంది. వైద్యుల పర్యవేక్షణలో మూడు పూటల పోషకాహారం తీసుకోవడంతో బరువు సైతం పెరిగింది. బాలికకు సకాలంలో మెరుగైన వైద్యాన్ని అందించిన డాక్టర్ నిష్టల శ్రీనివాస్ బృందానికి పలువురు అభినందనలు తెలిపారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య



దుర్గాప్రసాద్ మృతదేహం

కొత్తవలస: కొత్తవలస–పెందుర్తి రైల్వే లైన్‌లో మంగళపాలెం గ్రామ సమీపంలో రైలు కింద పడి తాటిచెట్లపాలెం సమీపంలోని సంజీవయ్య కాలనీకి చెందిన పిట్టా దుర్గాప్రసాద్ (47) శనివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడు కొద్ది కాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నట్టు తెలిసింది. మంగళపాలెంలో తెలిసిన వారి ఇంటికి వచ్చి తిరుగు ప్రయాణంలో రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడినట్టు స్థానికులు తెలిపారు. జీఆర్పీ ఎస్ఐ శ్రీనివాసరావు, ఆర్పీఎఫ్ ఎస్ఐ ఏడీ రావు ఘటనా స్థలానికి చేరుకుని మృతుడి వివరాలను సేకరించారు. మృతదేహాన్ని విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించారు.

కైలాసగిరిపై మరో ఆణిముత్యం

- రూ.4.69 కోట్లతో సైన్స్ మ్యూజియం నిర్మాణం



సైన్స్ మూజియం నిర్మాణం కోసం చదును చేస్తున్న స్థలం





ఇటీవల సైన్స్ మ్యూజియం నిర్మాణం కోసం శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మంత్రి అమర్‌నాథ్

ఆరిలోవ: నగరంలోని కైలాసగిరిని రాష్ట్రంలో అత్యంత ముఖ్యమైన పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడానికి రాష్ట్ర ప్రభుత్వం కంకణం కట్టుకుంది. ఇందులో భాగంగా సైన్స్ మ్యూజియం నిర్మాణానికి సిద్ధమైంది. కైలాసగిరి తూర్పు నియోజవకర్గం పరిధి జీవీఎంసీ తొమ్మిది, 18వ వార్డుల మధ్యలో పర్యాటకులను విశేషంగా అలరిస్తోంది. దీనిపై ఈ నెల 2న సైన్స్ అండ్ టెక్నాలజీ మ్యూజియం నిర్మాణం కోసం రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే. ఇప్పటికే దీనిపై సందర్శకులకు వినోదం, విజ్ఞానం అందిస్తూ ఆణిముత్యంగా నిలిచిన తెలుగు మ్యూజియం అందుబాటులో ఉంది. ఇప్పుడు మరో ఆణిముత్యంలాంటి అధునాతనమైన సైన్స్ అండ్ టెక్నాలజీ మ్యూజియం నిర్మాణం చేపడుతున్నారు. దీంతో రాష్ట్రంలోనే అత్యంత ప్రధానమైన పర్యాటక కేంద్రంగా నిలవనుంది. నగరానికి వచ్చే విదేశీ పర్యాటకులను సైతం ఆకట్టుకునేవిధంగా తయారు చేయడానికి అధికారులు సిద్ధమయ్యారు. ఇప్పటికే ఇక్కడ సందర్శకులను ఆకర్షించే విధంగా పచ్చదనం, విశాలమైన ఆట స్థలాలు, సందర్శకుల కోసం విశ్రాంతి స్థలాలు, వినోదం కోసం తెలుగు మ్యూజియం ఉన్నాయి. వీటికి సైన్స్ మ్యూజియం తోడుకానుంది.

రూ.4.69 కోట్లతో...

మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం కలిసి మ్యూజియం గ్రాంట్ స్కీం కింద సైన్స్ సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (ఎస్‌సీఏపీ) ఆధ్వర్యంలో ఇక్కడ అధునాతనమైన సైన్స్ అండ్ టెక్నాలజీ మ్యూజియం ఏర్పాటు చేస్తున్నారు. దీని కోసం కై లాసగిరిపై తెలుగు మ్యూజియంకు వెళ్లే రహదారి పక్కన సుమారు ఎకరం స్థలం కేటాయించారు. ఆ స్థలంలో రూ 4.69 కోట్ల నిధులు ఖర్చుచేసి ఆధునిక సైన్స్ అండ్ టెక్నాలజీ మ్యూజియం నిర్మిస్తున్నారు. దీనిలో రూ 3.75 కోట్లు ఎస్‌సీఏపీకి కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ కేటాయించగా మిగిలిన రూ. 94 లక్షలు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. వీఎంఆర్‌డీఏ అధికారులు దీని నిర్మాణ బాధ్యతలు చేపట్టారు. సుమారు ఎకరం విస్తీర్ణం గల స్థలంలో నిర్మిస్తున్న మ్యూజియంలో 3డీ ఆర్ట్ గ్యాలరీ, అగ్మెంటెడ్ రియాలటీ, సోలార్ ఎగ్జిబిట్స్, స్పేస్ ఎగ్జిబిట్స్ (ఇస్రో), సిలికా విగ్రహాలు, సైన్స్ వర్కింగ్ మోడల్ తదితర ప్రదర్శనలు, పలు శాస్త్రీయ థీమ్‌లు అందుబాటులో ఉంటాయి. వీటితోపాటు విద్యా విషయాలు సమగ్రపరచనున్నారు.

ఉపయోగకరం

మ్యూజియం విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉండేవిధంగా చర్యలు చేపడుతున్నారు. ఇందులో ఏర్పాటు చేసే ఆయా ప్రదర్శనలు ద్వారా విద్యార్థులకు సులువుగా అవగాహన కలుగుతుందని అధికారులు భావిస్తున్నారు. దీనిలో దృశ్య, ప్రయోగాత్మక అభ్యసనం జరగనుంది. విద్యార్థులకు శాస్త్రీయ భావనలపై లోతైన అవగాహన కలగనుంది. ఈ మ్యూజియం ద్వారా సంస్కృతి, సైన్స్, సాంకేతికతపై విద్యార్థులకు ఆశక్తి, అవగాహన కలగజేయడం, కొత్త ఆవిష్కరణలను ప్రదర్శించే విధంగా సైన్స్ సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు.

బోసిపోయిన ఆరిలోవ



ఆరిలోవలో వాహనాల సందడి లేని ప్రధాన రహదారి



ఖాళీగా ఉన్న బీఆర్‌టీఎస్ రోడ్డు

ఆరిలోవ: సంక్రాంతి వస్తే గ్రామాలు, కాలనీలు వాహనాల రాకపోకలు, జనం రద్దీతో సందడిగా కనిపిస్తాయి. అందరూ ఒకేచోట చేరి సరదాగా గడుపుతారు. నగరంలో మాత్రం అందుకు భిన్నంగా మారిపోతుంది. నగరవాసులంతా గ్రామాలకు చేరుకోవడంతో కాలనీలు ఖాళీ అవుతున్నాయి. ఈ క్రమంలో ఆరిలోవ శనివారం నుంచే బోసిపోయింది. ఆరిలోవలో నివాసముంటున్న వారిలో సుమారు 80 శాతం పైగా ప్రజలు వివిధ జిల్లాల్లోని పలు గ్రామాలకు చెందినవారే. వారంతా సంక్రాంతి జరుపుకోవడానికి సొంత ఊళ్లకు వెళ్లిపోతున్నారు. నాలుగు రోజుల క్రితమే పాఠశాలలకు సెలవులు ఇవ్వడంతో రెండు రోజులుగా ఊర్లు వెళ్తున్నారు. శనివారం మూడొంతులకు పైగా ఆరిలోవ నుంచి బయలుదేరేశారు. దీంతో ఈ ప్రాంతం బోసిపోయింది. నిత్యం వాహనాల రాకపోకలతో సందడిగా ఉండే ఇక్కడి రోడ్లు ఖాళీ అయ్యాయి. రణగొణ శబ్దాలతో చెవులను హోరెత్తించే వాహనాల హారన్ వినిపించడం లేదు. అన్ని వాహనాలూ అటు శ్రీకాకుళం, విజయనగరం, ఇటు నర్సీపట్నం, అనకాపల్లి వైపు ప్రయాణించాయి. నగరం నుంచి వచ్చిపోయే ఆర్టీసీ సిటీ బస్సులు తప్ప ఆటోలు, కార్లు, ద్విచక్ర వాహనాల సంఖ్య వేళ్ల మీద లెక్కపెట్టొచ్చు. సొంత నివాసాలు ఉన్నవారు సైతం సంక్రాంతి రోజు పెద్దలను పూజించడానికి తమ సొంతూళ్లకు ప్రయాణమయ్యారు. దీంతో ఆరిలోవ ప్రాంతంలో 20 శాతం దాటి ప్రజలు మిగలరని స్థానికులు భావిస్తున్నారు.

పటిష్టమైన పోలీస్ నిఘా

సంక్రాంతి సందర్భంగా ఆరిలోవలో ఎక్కువ మంది ఊర్లు వెళుతున్నారు. దీంతో తాళాలు వేసిన ఇళ్లు ఎక్కువగా ఉంటాయి. దీన్ని దృష్టిలో పెటుకొని పోలీస్ నిఘా మరింత ఎక్కువగా పెడుతున్నాం. పోలీస్ స్టేషన్ పరిధిలో సాగర్‌నగర్, విశాలాక్షినగర్, ఆదర్శనగర్, రవీంద్రనగర్, బాలాజీనగర్, ఆరిలోవ కాలనీ వరకు అన్ని వీధుల్లోనూ ప్రత్యేకంగా పోలీస్ పెట్రోలింగ్ చేపడుతున్నాం. స్థానికులు సహకరించాలి. ఆరిలోవలో ఉన్నవారు తాళాలు వేసి ఉన్న ఇరుగు పొరుగు ఇళ్లను పరిశీలించాలని కోరుతున్నాం. – సోమశేఖర్, సీఐ, ఆరిలోవ

దిగివచ్చిన కూరగాయల ధరలు

- వినియోగదారులకు ఊరట
- రైతుబజార్లకు సంక్రాంతి శోభ



పెదవాల్తేరు రైతుబజార్‌లో వినియోగదారుల సందడి



చెరుకుగడలు విక్రయిస్తున్న రైతులు



రైతుబజార్‌లో పువ్వుల విక్రయాలు

ఏయూక్యాంపస్: కూరగాయల ధరలు దిగివస్తున్నాయి. నెల రోజుల కిందట వరకు అధికంగా ఉన్న ధరలు నెమ్మదిగా తగ్గుతున్నాయి. దీనితో వినియోగదారులు కొంత సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు కూరగాయలు, ఆకుకూరల పంటలు దెబ్బతిన్నాయి. దీనితో దిగుబడి లేక ధరలు గణనీయంగా పెరిగాయి. నెల రోజుల క్రితం కిలో రూ.50కు పైగా పలికిన కూరగాయలు.. నేడు రూ.20 – రూ.30 మధ్యలో విక్రయాలు జరుగుతున్నాయి. దీంతో వినియోగదారులకు ఊరట లభించింది.

విస్తారంగా కాలీఫ్లవర్..

రైతుబజార్లలో విస్తారంగా కాలీఫ్లవర్ కనిపిస్తోంది. వీటిని రైతులు కిలోల లెక్కన విక్రయించడానికి ఆసక్తి చూపడం లేదు. ఒక్కో పువ్వు రూ.40 నుంచి రూ 60 వరకు విక్రయిస్తున్నారు. వినియోగదారులు ప్రశ్నించి, అడిగితేనే కిలోల లెక్కన విక్రయిస్తున్నారు.

సంక్రాంతి సామగ్రి కొనుగోళ్ల సందడి

రైతుబజార్లలో సంక్రాంతి శోభ కనిపిస్తోంది. శనివారం నుంచి వినియోగదారులు పండగ సమయంలో అవసరమైన కూరగాయలు, పండ్లు, పువ్వులు, చెరుకు గడలు వంటివి కొనుగోలు చేస్తున్నారు. అరకు నుంచి వచ్చిన గిరిజన రైతులు ఎర్రటి చెరకు గడలను పెద్దవి రూ.60, చిన్నవి రూ.50 చొప్పున విక్రయిస్తున్నారు. పండగ రోజుల్లో ఇంటిని అలంకరించడానికి, పూజలకు అవసరమైన పుష్పాలను కొనుగోలు చేస్తున్నారు. వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా రైతులు అవరమైన పువ్వులను అదనంగా తీసుకొచ్చి విక్రయానికి సిద్ధంగా ఉంచారు. హైబ్రీడ్ చామంతి, దేశవాళీ చామంతులు కిలో రూ.250, దేశవాళీ గులాబీ డజను రూ.20, బంతి దండ రూ.20–రూ.25, మల్లెలు కిలో రూ.450, కనకాంబరాలు మూర రూ.50 చొప్పున విక్రయిస్తున్నారు. పండగ సామగ్రి కొనుగోళ్లతో రైతుబజార్లలో వినియోగదారుల సందడి నెలకొంది.

ఈ నెల 1, 13 తేదీల్లో కూరగాయల ధరలు ఇలా..

కూరగాయలు	1వ తేదీ ధరలు	13వ తేదీ నాటి ధరలు
వంకాయలు	రూ.42	రూ.24
వెల్లంకి వంకాయలకు	రూ.50	రూ.32
బెండకాయ	రూ.54	రూ.46
మిర్చి	రూ.44	రూ .38
అల్లం	రూ.110	రూ.100
క్యాబేజీ	రూ.20	రూ.17
బరబాటీ	రూ.54	రూ.38
ఆనప	రూ.32	రూ.22
క్యారెట్	రూ.37	రూ.26
నిమ్మకాయలు	రూ.65	రూ.55

ఆలయాలకు పండగ శోభ

- పుష్పాలతో ప్రత్యేక అలంకరణ



వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఉత్సవమూర్తులు



పోలమాంబ అమ్మవారు



ఆలయం వద్ద విక్రయిస్తున్న పిడకల దండలు

ఏయూ క్యాంపస్ : ఆలయాలు పండగ శోభను సంతరించుకుంటున్నాయి. భోగి, సంక్రాంతి, కనుమ పండగ నేపథ్యంలో భక్తులు ఆలయాలను సందర్శించుకుని తమ ఇష్టదేవతలను ప్రార్థిస్తారు. ఈ క్రమంలో శోభాయమానంగా తీర్చిదిద్దుతున్నారు. పుష్పాలతో, విద్యుత్ దీపాలలో అలంకరిస్తున్నారు. స్థానిక పెదవాల్తేరులోని పోలమాంబ ఆలయం, ఈస్ట్ షిర్డీ సాయి ఆలయం, లాసన్స్‌బే కాలనీలోని వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో పండగ రోజుల్లో భక్తుల దర్శనాలకు అనుగుణంగా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పోలమాంబ ఆలయంలో ప్రత్యేక అలంకరణ పనులు శనివారం ప్రారంభించారు. లాసన్స్ బే కాలనీ (పెదవాల్తేరు) శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో ఆదివారం ఉదయం భోగి రోజున గోదా కళ్యాణం నిర్వహించనున్నారు. ఉదయం 9.30 గంటల నుంచి ఆలయ ప్రాంగణంలో కళ్యాణం నిర్వహిస్తారు. భక్తులు పెద్దసంఖ్యలో హాజరు కావాలని ఆలయ పురోహితులు సూర్యనారాయణ కోరారు. ఈస్ట్‌పాయింట్ కాలనీలోని ఈస్ట్ షిర్డీ ఆలయ సముదాయంలో సంక్రాంతి సందర్భంగా పెద్దసంఖ్యలో స్థానికులు దర్శనాలకు విచ్చేస్తారు. ఈ ప్రాంగణంలో శివుడు, లలితాదేవి, సూర్యనారాయణ మూర్తి, శ్రీ సీతారామలక్ష్మణ హనుమ, గణపతి, సుబ్రహ్మణ్య, అయ్యప్ప ఆలయాలు సైతం ఉన్నాయి. దీంతో అధిక సంఖ్యలో భక్తులు ఆలయాన్ని సందర్శించుకుంటారు. అదేవిధంగా ఆలయం వద్ద భోగి రోజున వినియోగించడానికి వీలుగా ఆవుపేడ పిడకలను సైతం విక్రయిస్తున్నారు.

దొంగతనాల కట్టడికి పోలీసుల చర్యలు



దొంగతనాల నియంత్రణపై సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న ఎంవీపీ క్రైం ఎస్ఐ రాందాస్

ఎంవీపీకాలనీ: సంక్రాంతి వేళ.. దొంగతనాల కట్టడికి ఎంవీపీ పోలీసులు పటిష్ట చర్యలు చేపట్టారు. పండక్కి నగర వాసులు పెద్ద ఎత్తున సొంతూళ్లకు వెళ్తున్నారు. ఇదే అదునుగా దొంగతనాలు జరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో వాటిని అరికట్టేందుకు అవగాహన కల్పించడంతోపాటు కరపత్రాలు పంపిణీ చేస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం ఎంవీపీ కాలనీ క్రైం ఎస్ఐ రాందాస్ సిబ్బందికి పోలీస్ స్టేషన్ ఆవరణలో పలు సూచనలిచ్చారు. కరపత్రాలు, ఆటో ప్రచారం ద్వారా ఊరెళ్లే వారికి అవగాహన పెంచాలని సూచించారు. ఊరెళ్లే వారు పోలీసులకు సమాచారం అందించేలా చైతన్య పరచాలని, అలా సమాచారం ఇచ్చిన వారి నివాస ప్రాంతాలపై నిత్యం నిఘా ఉంచాలని సూచించారు. దీంతోపాటు క్రైం జరిగేందుకు అవకాశం ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక బృందాలు నిరంతర పర్యవేక్షణ ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న ప్రముఖులు



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ దంపతులు



ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకరరావుకు అప్పన్న జ్ఞాపిక అందజేస్తున్న ఈవో

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకర్రావు, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ దంపతులు స్వామిని దర్శించుకున్నారు. వీరంతా ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అంతరాలయంలో అర్చకులు స్వామికి పూజలు చేసి వేద ఆశీర్వచనం ఇచ్చారు.ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి జ్ఞాపిక,ప్రసాదాన్ని ఈవో శ్రీనివాసమూర్తి వారికి అందజేశారు.

శ్రీవారి లడ్డూల విక్రయం

కొమ్మాది: రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో (టీటీడీ) రెండో శనివారం లడ్డూ విక్రయాలు కొనసాగాయి. లడ్డూ విక్రయాల కౌంటర్ వద్ద భక్తులు బారులు దీరారు. రూ. 50 లడ్డూలు అందుబాటులో ఉండటంతో భక్తులు కొనుగోలు చేశారు.

- శ్రీవారి శ్రవణ నక్షత్రం సందర్భంగా స్నపన తిరుమంజనం వైభవంగా నిర్వహించారు.

ముగిసిన గురు పూజోత్సవాలు

మహారాణిపేట: ఆధునిక యుగంలో రకరకాల సమస్యలతో సతమతమవుతున్న మానవాళికి పరిష్కార మార్గమొక్కటే శరణ్యమని.. అలాంటి మార్గం పరమ గురువుల బోధనల్లో లభిస్తుందని ఆదాయ పన్నుల శాఖ కమిషనర్ బి.ఎస్.ఎన్. రాజు(కోల్‌కతా) అన్నారు. జిల్లా పరిషత్ సమీపంలోని అంకోశా ఫంక్షన్ హాలులో శనివారం జగద్గురు పీఠం నిర్వహించిన 63వ మాస్టర్ సీవీవీ గురుపూజోత్సవాల ముగింపు సభలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. శ్రీ రామకృష్ణ పరమహంస, స్వామి వివేకానంద, మాస్టర్ పార్వతీకుమార్ బోధనలతో తాను ప్రభావితం చెందానన్నారు. అనంతరం పార్వతీకుమార్ రాసిన మెర్రీ లైఫ్ డే అనే ఆంగ్ల పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. జగద్గురు పీఠం కార్యదర్శి బి.ఆర్.కె.రాజు 'శంబళ' అనే మరో పుస్తకాన్ని ఆవిష్కరించారు. సంస్థ సలహా మండలి సభ్యుడు కె.ఎస్.ఆర్.గోపాల్ (హైదరాబాద్) 'విష్ణు సహస్రనామ'ప్రసంగాల రెండవ సంపుటిని విడుదల చేశారు. సభకు అధ్యక్షత వహించిన ధనిష్టా ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ కె.గురుప్రసాద్ మాట్లాడుతూ విదేశాల్లో మత సంస్థ చేపడుతున్న జ్ఞానయజ్ఞం, రామనామ యజ్ఞ కార్యక్రమాలను వివరించారు. గురు పూజలో భాగంగా పప్పు రవిశంకర్ రుద్రాభిషేకం నిర్వహించారు. బెంగళూరుకు చెందిన కె.రవి, ఖరగ్‌పూర్‌కు చెందిన జి.వి.కృష్ణమోహన్ తమ అనుభవాలను వివరించారు. 'నావాణి 'దర్శన మాసపత్రికపై సమీక్ష జరిపారు. జగద్గురుపీఠం వివిధ కేంద్రాల నుంచి రెండు వేలమందికి పైగా సాధకులు ఈ ఉత్సవాల్లో పాల్గొన్నారు. మాస్టర్ ఇ.కె. నీరాజనంతో 63వ గురుపూజోత్సవాలు ఘనంగా ముగిశాయి. సంస్థ డైరెక్టర్ అజ్జరపు శ్రీనివాస్ ఏర్పాట్లు పర్యవేక్షించగా, జగద్గురుపీఠం డైరెక్టర్ చింతలపాటి సత్యదేవ్ పాల్గొన్నారు.

ఆధునికతను స్వాగతిద్దాం.. సంప్రదాయాలను కాపాడుకుందాం

సినీ నటుడు సాయికుమార్



సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న సినీ నటుడు సాయికుమార్, ఎంపీ జీవీఎల్ తదితరులు


ఏయూక్యాంపస్: ఆధునికతను స్వాగతిస్తూనే.. మన సంప్రదాయాలను కాపాడుకుందామని సినీనటుడు పూడిపెద్ది సాయికుమార్ పిలుపునిచ్చారు. రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు ఆధ్వర్యంలో ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న మహా సంక్రాంతి సంబరాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. కవులు, రచయితలు, కళాకారులను అందించిన విశాఖ నగరం సాంస్కృతిక రాయబారిగా నిలుస్తుందన్నారు. 'నా తండ్రిది విజయనగరం జిల్లా కళ్లేపల్లి అగ్రహారం. నేను శ్రీకాకుళం జిల్లా అల్లుడినే..' అని చెబుతూ ఉత్తరాంధ్రతో తనకున్న అనుబంధాన్ని వివరించారు. మన సంస్కృతి, సంప్రదాయాలు, కళలను భావితరానికి అందించే బాధ్యతను జీవీఎల్ బృందం ఎంతో సమన్వయంతో నిర్వహించిందని కొనియాడారు.

తొలి షీల్డ్ విశాఖలోనే అందుకున్నా..

తాను నటించిన తొలి చిత్రం ఛాలెంజ్ విశాఖలో చిత్రీకరించారని.. చిరంజీవితో కలిసి ఈ చిత్రంలో నటించిన సందర్భాన్ని సాయికుమార్ గుర్తు చేసుకున్నారు. ఈ చిత్రం 100 రోజుల వేడుక విశాఖలో జరిగిందని, మొదటి షీల్డ్‌ను ఇక్కడే తీసుకున్న జ్ఞాపకాలను వివరించారు. సాయంత్రం వేళ ఉత్తరాంధ్రకు చెందిన కళాకారుల ప్రదర్శనలు, మిమిక్రీ, సంగీత విభావరి, శాస్త్రీయ నృత్యాలు ఎంతో ప్రత్యేకమని చెప్పారు.

ఎంపీ జీవీఎల్ మాట్లాడుతూ ఘంటసాల పాట, గోంగూర పచ్చడి తెలుగు వారికి ఎంత ఇష్టమో.. సాయికుమార్ స్వరం కూడా అంతే ఇష్టమన్నారు. ఆదివారం ఉదయం 4 గంటల నుంచి ఇదే ప్రాంగణంలో భోగి మంటలు, మధ్యాహ్నం 3 గంటల నుంచి చిన్నారులకు భోగిపళ్లు పోసే కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. పల్లె వాతావరణాన్ని ప్రతిబింబించేలా ఇక్కడ చేసిన ఏర్పాట్లు ఆకట్టుకున్నాయి. డప్పు వాయిద్యాలు, గంగిరెద్దులు, థింసా నృత్యాలు, కోలాటం, కర్రసాము, సంగీత విభావరి నగర వాసులను అలరించింది. శ్రీ రామాయణ నృత్యరూపకం, ప్రాసమణి ప్రసంగం అదరహో అనేలా సాగింది. బుల్లెట్ భాస్కర్ టీం చేసిన స్కిట్లు కడుపుబ్బా నవ్వించాయి.

హంపీ పీఠాధిపతి అనుగ్రహ భాషణం



భక్తులనుద్దేశించి అనుగ్రహ భాషణం చేస్తున్న విద్యారణ్యభారతి

ఏయూక్యాంపస్: హంపీ పీఠాధిపతి పూజ్యశ్రీ విద్యారణ్యభారతి స్వామి కిర్లంపూడిలోని శ్రీ లలితాపీఠాన్ని సందర్శించారు. పీఠంలో భక్తులను ఉద్దేశించి అనుగ్రహ భాషణం చేశారు. శనివారం సాయంత్రం లలితాపీఠాన్ని సందర్శించిన స్వామీజీకి ఆలయ అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం విద్యారణ్య భారతి స్వామి ఆలయంలో లలితాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సంక్రాంతిని పురస్కరించుకుని భక్తులనుద్దేశించి ప్రసంగించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు కాండూరి లక్ష్మణ స్వామి, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.